క్లుప్తంగా

ధర్మవరంలో వైద్య శిబిరం



మొక్కలు నాటుతున్న వైద్యసిబ్బంది

ఎచ్చెర్ల: ధర్మవరం పంచాయతీలో ఆదివారం సమాజ సేవకులు, సన్‌రైజ్ హాస్పిటల్ అధినేత డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, ఫిజికల్ హీలింగ్ డాక్టర్ దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 250 మందికి రక్త పరీక్షలు, ఈసీజీలు తీసి అవసరమైనవారికి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యానికి సంబంధించిన జాగ్రత్తలను వివరించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు శ్యామలరావు, బగ్గు రాజారావు, ఎంపీటీసీ రుప్ప రమేష్, అల్లు కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఎచ్చెర్ల: చిలకపాలెం గ్రామానికి చెందిన గీత కార్మికుడు యర్రంనాయుడు తాటిచెట్టు పైనుంచి జారిపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న తీన్‌తార్ ట్రస్ట్ సభ్యులు జూనియర్ ఎన్టీఆర్ చిన్నకుమారుడు భార్గవరామ్ పుట్టినరోజు సందర్భంగా రూ. 28 వేలు ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



చెత్త తొలగిస్తున్న కార్మికులు

జి.సిగడాం: పెంట గ్రామంలో ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ పున్నా సోనియా ఆధ్వర్యంలో కార్యదర్శి పొట్నూరు సురేష్‌కుమార్ పర్యవేక్షణలో పారిశుద్ధ్య కార్మికులు కాలువల్లో చెత్తాచెదారం, పూడికలు తొలగించారు.

17న శ్రీకూర్మం గ్రామదేవత ఉత్సవం



మోహినీ భద్రాంబిక అమ్మవారు

గార: మేజర్ పంచాయతీ శ్రీకూర్మం గ్రామదేవత మోహినీ భద్రాంబిక అమ్మవారి పండగ ఈ నెల 17న అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆదివారం తెలిపారు. అనుపోత్సవంలో భాగంగా విచిత్ర వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం అమ్మవారి జంగిడి ప్రారంభమై వీధుల్లో ఊరేగింపుగా వెళ్తూ రాత్రివేళ గుడికి చేరుకుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు ముర్రాటలతో వెళ్లి అమ్మవారికి చల్లదనం చేస్తారని చెప్పారు. శ్రీకాకుళం ఒకటో పట్టణ సీఐ పైడపునాయుడు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

మురపాకలో అక్రమ కట్టడాల తొలగింపు



కాలువపై అక్రమ కట్టడాలను తొలగిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల : లావేరు మండలం మురపాకలో మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న ప్రధాన కాలువపై అక్రమంగా కట్టిన శ్లాబ్‌లు, నిర్మాణాలు, షాపులను పంచాయతీ అధికారులు ఆదివారం తొలగించారు. అక్రమ కట్టడాలతో పూడిక తీతలకు అవకాశం లేక మురుగునీరు పైకివచ్చి వస్తుండటంతో ఈ పనులు చేపట్టినట్లు సర్పంచ్ పెయ్యిల నాగమణి తెలిపారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ చట్ట ప్రకారమే కాలువపై అక్రమ కట్టడాలను తొలగిస్తున్నటట్లు చెప్పారు. వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు. భవిష్యత్తులోనూ కాలువపై ఎటువంటి నిర్మాణాలు చేపట్టవద్దన్నారు.

19న షర్మిల రాక

శ్రీకాకుళం అర్బన్ : పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఈ నెల 19న జిల్లా పర్యటనకు రానున్నారని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు తెలిపారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని ఇందిరావిజ్ఞానభవన్‌లో ఆదివారం జిల్లా ఇన్‌చార్జి గాదం వెంకట త్రినాథరావుల ఆధ్వర్యంలో పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు.

చీకట్లో సిక్కోలు

జిల్లా కేంద్రంలో సాయంత్రం ఆరు గంటలు దాటితే చాలు అనేక వీధులు అంధకారంలో మగ్గుతున్నాయి. వీధి లైట్లు వెలగకపోవడంతో వాహనచోదకులు, పాదచారులు పలుమార్లు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

- సాయంత్రమైతే నగరవీధుల్లో అంధకారమే
- వెలగని వీధిలైట్లు
- ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం



ఏడురోడ్ల కూడలి- పాలకొండ రోడ్డులో వెలగని లైట్లు



చీకటిగా మారిన పాలకొండ రోడ్డు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): తాములోకి అధికారంలోకి వస్తే పేదల బతుకుల్లో వెలుగులు నింపుతామని కూటమి నాయకులు ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికారు. జీవితాల్లో వెలుగులు సంగతి అటుంచితే కనీసం వీధుల్లోనూ వెలుగులు లేని పరిస్థితి దాపురించింది. నగరంలోని ప్రధాన రహదారులైన 80 అడుగుల రోడ్డు, పాలకొండ రోడ్డు, కళింగ రోడ్డుతో పాటు అనేక కాలనీల్లో వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో రాత్రి వేళల్లో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

ఇదే అదునుగా దొంగతనాలు సైతం ఎక్కువైపోతున్నాయి. ఇటీవల పీఎన్‌కాలనీలో ఓ వృద్ధురాలి మెడలో బంగారం తెంచుకుపోయారు. ఇలా అనేక చోట్ల చిల్లర దొంగతనాలు.. ద్విచక్రవాహనాలు చోరీలు నిత్యంకృత్యమవుతున్నాయి.

చూస్తాం..చేస్తాం..

వీధిలైట్ల సమస్యపై కార్పొరేషన్ పరిధిలో విద్యుత్ విభాగం ఇంజినీర్లకు ప్రజలు పలుమార్లు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా ఉంటున్నారని స్థానికులు చెబుతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా విద్యుత్ విభాగంలో కొంతమంది ఇంజినీర్లు, సిబ్బంది తీరులో మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, ఇంజినీరింగ్ విభాగం టెక్నికల్ వర్కర్లు 32 రోజులుగా సమ్మెలో ఉండటంతో ఇటువంటి సమస్యలు వస్తున్నాయని చెబుతున్నారు. ఏదిఏమైనా, ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైనప్పుడు పాలన ఎందుకు చేయాలని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. ప్రత్యామ్నాయంగా వర్కర్లను ఏర్పాటుచేసి విద్యుత్, తాగునీరు అందించే విషయంలో లోపం లేకుండా చూడాలని కోరుతున్నారు. పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ మౌలిక సదుపాయాలు కల్పించడంలోనూ చూపాలని నగరవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



అంధకారంగా రోడ్డు



నగరంలో ని80 అడుగుల రోడ్డులో వెలగని వీధిలైటు

చర్యలు చేపడతాం..

విద్యుత్ లైట్లు మరమ్మతులకు గురైతే వెంటనే మరమ్మతులు చేపడతాం. ఏ ప్రాంతంలో వెలగడం లేదో చెబితే వెంటనే బాగుచేయిస్తాం. ఈ విషయమై ఇంజినీరింగ్ విభాగం ఇంజనీర్లకు ఆదేశాలు జారీచేస్తాం.

– పి.వి.వి.డి.ప్రసాదరావు, కమిషనర్, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు?

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా నిరుద్యోగ భృతి రూ.3వేలు చెల్లించకపోవడం యువతను మోసగించడమేనని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. ఆదివారం జి.సిగడాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావుపై అక్రమంగా కేసులు నమోదు చేసి అరెస్టు చేయడంపై దేశ అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా ఆక్షేపించడంమే కాకుండా తక్షణమే విడుదల చేయాలని ఆదేశాలు ఇవ్వడం కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు వంటిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు తప్ప పథకాల అమలుపై దృష్టి సారించడం లేదన్నారు. ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలన్నారు. ప్రజలను మోసగించడమే చంద్రబాబు నైజమన్నారు. ఆయనతోపాటు మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షుడు దోల వెంకటరమణ, మాజీ సర్పంచ్ వెలిది సాయిరాం, మాజీ ఉపసర్పంచ్ సువ్వాడ చండీ ప్రసాద్, తాంద్రోతు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర గ్రంథాలయాన్ని అన్యాక్రాంతం చేయవద్దు



ధర్నా చేస్తున్న గ్రంథాలయ పరిరక్షణ కమిటీ సభ్యులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని అన్యాక్రాంతం చేసే ప్రయత్నాలను విరమించుకోకపోతే, ప్రజల మద్దతుతో పోరాటం ఉధృతం చేస్తామని జిల్లా కేంద్ర గ్రంథాలయ పరిరక్షణ కమిటీ ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం కేంద్ర గ్రంథాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు కరణం బుచ్చిసుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి తమరి వైకుంఠరావు తదితరులు మాట్లాడుతూ గ్రంథాలయాన్ని అభివృద్ధి పేరుతో అన్యాక్రాంతం చేయవద్దని, ప్రైవేటీకరణ తగదని గ్రీవెన్స్‌సెల్‌లో వినతిపత్రం ఇచ్చిన కమిటీ నాయకులను జైల్లో పెడతామని హెచ్చరించడాన్ని తీవ్రంగా ఖండించారు. బయట రీడింగ్ రూములలో వేలకు వేలు ఫీజులు చెల్లించి చదువుకోలేని నిరుద్యోగ యువతకు ప్రభుత్వ పరంగా ఈ గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడుతున్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్ష కార్యదర్శులు ఎం.ప్రభాకర్, పి.సుధాకర్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పేకల తేజేశ్వరరావు, జె.వి.వి.సమత కో–కన్వీనర్ తంగి ఎర్రమ్మ, ఎం.గోవర్ధనరావు, పి.వెంకటరావు, కొత్తకోట అప్పారావు, వై.చలపతిరావు, కె.గణపతి, పి.మోహనరావు, ఎం.శ్రీనివాసరావు, బి.సూర్యారావు, ఆర్.ప్రకాశరావు, జనవిజ్ఞాన వేదిక ఎడ్యుకేషన్ సబ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ గొంటి గిరిధర్, పాఠకులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు పూర్తిస్థాయిలో సాగునీరు



మడ్డువలస కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

జి.సిగడాం: ఖరీఫ్ సీజన్‌లో మడ్డువలస కాలువ ద్వారా శివారు ప్రాంతాలకు సైతం సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఆదివారం మధుపాం గ్రామ సమీపంలో మడ్డువలస కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, ప్రజలు సహకరిస్తే ప్రతి సెంటుకు సాగునీరు అందిస్తామన్నారు. చివరి ప్రాంతమైన వాండ్రంగి పంట పొలాలకు ఈఏడాది ఎట్టి పరిస్థితుల్లోనూ కాలువ ద్వారా సాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకేటి నాగరాజు, ఎంపీటీసీ బూరాడ వెంకటరమణ, సుడా ఎస్ఈ పొగిరి సుగుణాకరరావు, మడ్డువలస ప్రాజెక్ట్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి జన్మనక్షత్ర పూజలు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయల్లో స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్ర పూజలు ఆదివారం ఘనంగా జరిగాయి. అర్చకులు బూరాడ వంశీకృష్ణమాచార్యు అర్చకత్వంలో స్వామివారి అభిషేకాలు, భజన మండలి ఆధ్వర్యంలో తిరువీధి భజనలు, హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షులు లోకనాథం నందికేశ్వరరావు, అధ్యక్ష కార్యదర్శులు మర్రి యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న సీనియర్ సిటిజన్లు

శ్రీకాకుళం కల్చరల్: వృద్ధులను ఆదరిస్తూ ప్రేమగా చూడటం కుటుంబ సభ్యుల బాధ్యతని వక్తలు పేర్కొన్నారు. సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని నగరంలోని శాంతాకల్యాణ్ అనురాగ నిలయంలో ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ వేధింపులకు గురవుతున్న వృద్ధులను గుర్తించి వారి కోసం సీనియర్ సిటిజెన్ హోం నిర్మించేందుకు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సంఘ అధ్యక్షుడు బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ పెద్దలను గౌరవించేలా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ సహాధ్యక్షులు సోమసుందరరావు, పి.నరసింహమూర్తి, పి.ఎస్.ప్రసాదరావు, యు.వి.జి.కాంతారావు, వి.నాగేశ్వరరావు, ఎస్.కోటేశ్వరరావు, బి.పోలయ్య, జోగారావు, బి.మోహనరావు, రాజేశ్వరరావు, ఎస్.బాషా, కె.రాంబాబు, జి.ఝాన్సీరాణి, కె.సవరయ్య, ఎ.రామేశ్వరరావు, కె.సన్యాసిరావు, డి.చిరంజీవిరావు, వై.సత్యంనాయుడు, ఎస్.భానుమూర్తి, జి.జగ్గునాయుడు. జి.గురువులు, ఎల్.వి.కె.నందికేశ్వరరావు, పి.నాగేశ్వరరావు, వి.భాస్కరరావు, పి.రమణయ్య పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత సింగుపురం



షీల్డ్‌తో సింగుపురం జట్టు

శ్రీకాకుళం రూరల్ : సింగుపురంలో నెల రోజులుగా జరుగుతున్న ఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆతిథ్య సింగుపురం జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం మునసబుపేట జట్టుతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విజయభేరి మోగించింది. విజేత జట్టుకు గ్రామపెద్దలు సింహాద్రి నగేష్ చేతులమీదుగా షీల్డ్ అందజేశారు. ఈ టోర్నీలో 15 జట్లు పాల్గొన్నాయి.

ఆకట్టుకున్న భాగవత ప్రవచనాలు



ప్రవచనాలు చెబుతున్న గోవింద ప్రభు

శ్రీకాకుళం కల్చరల్: పొన్నాడ సమీపంలోని ఇస్కాన్ జగన్నాథ మందిరంలో ఆదివారం శ్రీవారి గోవింద ప్రభు.. జగన్నాథ భాగవతం ప్రవచనాలు చెప్పారు. భక్తి వేదాంత భాగవత ఇతిహాసాలలోని దృశ్యాలను హృద్యంగా వివరించారు. అంతకుముందు హరేకృష్ణ మేలు కొలుపు, శ్రీకృష్ణ బలరామ సుభద్రలకు తులసీదళాలతో అర్చనలు, అలంకరణ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్కాన్ మందిరం అధ్యక్షులు లక్ష్మీపతి గౌరీదాస్, భక్తులు పాల్గొన్నారు.

నీట్‌లో మెరిసిన రైతు బిడ్డ



సాయినిహారిక

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని చాపురం పంచాయతీ నర్సుస్ కాలనీకి చెందిన కొబగాపు సాయి నిహారిక నీట్ ఫలితాల్లో ఆల్ ఇండియా 1283వ ర్యాంకు కైవసం చేసుకుంది. 720 మార్కులకు గాను 601 మార్కులతో సత్తాచాటింది. ఈ సందర్భంగా ఆదివారం ఆమె మాట్లాడుతూ తనది వ్యవసాయ కుటుంబమని, తల్లిదండ్రులు కొబగాపు కోటేశ్వరరావు, వాహిని ప్రోత్సాహంతో లాంగ్ టర్మ్ కోచింగ్‌కు వెళ్లకుండా ఇంటివద్దనే కష్టపడి చదివినట్లు తెలిపింది. గత ఏడాది కూడా నీట్ పరీక్ష రాయగా వెటర్నరీ విభాగంలో సీటు వచ్చిందని, ఎలాగైనా డాక్టర్ కావాలనే ఆకాంక్షతో పట్టుదలతో చదివి ఈసారి మంచి ర్యాంకు సాధించినట్లు చెప్పింది. తమ కుమార్తె ఓబీసీ కేటగిరిలో విజయం సాధించడం పట్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ ఈశ్వరరావు రౌడీషీటర్లనుద్దేశించి మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ల్యాండ్ సెటిల్‌మెంట్లు, బహిరంగ ప్రదేశాల్లో న్యూసెన్స్‌ను సహించేది లేదని స్పష్టం చేశారు.

• వార్షికోత్సవ వైభవం



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



డీసీసీబీ కాలనీలో స్వామివారి కల్యాణ వేడుకలు

నగరంలోని డీసీసీబీ కాలనీలోని భూసమేత వేంకటేశ్వర స్వామికి వార్షికోత్సవం, కల్యాణ వేడుకలు ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. అర్చకులు చామర్తి గోపాలాచార్యులు, ప్రతిష్టాపనాచార్యులు చామర్తి జగన్నాథాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారి నిజరూప దర్శనం, క్షీరాభిషేకాలు జరిగాయి. గరుడ ధ్వజప్రతిష్ఠ, హోమాలు, శేషవాహన సేవలు జరిగాయి. అనంతరం సంప్రదాయబద్ధంగా కల్యాణ వేడుకలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అరసవల్లి రోడ్డులో ఉన్న రమ్య తిరుమలలో కూడా స్వామివారి కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి.

– శ్రీకాకుళం కల్చరల్

రాష్ట్ర పురస్కార గ్రహీతకు అభినందనలు



ప్రిన్సిపాల్ శివశంకర్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న మంత్రి, ఉన్నతాధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.శివశంకర్ ఏపీ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరులో జరిగిన కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చేతులమీదుగా రాష్ట్రస్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. అత్యుత్తమ రక్త ప్రేరకుడి విభాగంలో మొదటి స్థానంలో స్టేట్ అవార్డు వరించింది. ఈ సందర్భంగా శివశంకర్‌ను జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు, ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ ఎన్.సుగుణారెడ్డి, జిల్లా డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, అధ్యాపకులు, సిబ్బంది ఆదివారం అభినందించారు.

ఇంజినీరింగ్ కార్మికులపై చిన్నచూపు తగదు



దీక్షలో పాల్గొన్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలో 32 రోజులుగా సమ్మె చేస్తున్నా కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం దారుణమని ఇంజినీరింగ్ కార్మికులు యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు, వై.శ్యామలరావు, ఆర్.సతీష్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న నిరవధిక సమ్మెలో భాగంగా చేపట్టిన సమ్మె ఆదివారం 32వ రోజుకి చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మొండివైఖరి వీడకపోతే ప్రజలకు ప్రస్తుతం అందిస్తున్న సర్వీసులు పూర్తిగా నిలిపివేయక తప్పదని హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కాకపోతే ఆమరణ నిరాహార దీక్షలు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

రాజకీయాలకు దళితులను వాడుకోవడం తగదు



పొన్నాడ రుషి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాజకీయ క్రీడల్లో దళితుల్ని వాడుకుంటారా అని సాక్షాత్తు దేశ అత్యున్నత న్యాయస్థానమే సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టును ఉద్దేశించి ఆగ్రహం వ్యక్తం చేసిందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనలో ఎస్సీ, ఎస్టీ కేసుకు ఆస్కారమే లేదని, అయినా పోలీసులు ఎస్సీ, ఎస్టీ సెక్షన్లు ఎలా ఆపాదిస్తారని ప్రశ్నించారు. ఏ కేసు దేనికి వర్తిస్తుందనేది న్యాయస్థానం తెలియజేసే వరకు గ్రహించకపోవడం శోచనీయమన్నారు. దళితులుగా పుట్టాలని ఎవరు కోరుకుంటారని అవహేళన చేసిన చరిత్ర చంద్రబాబుదన్నారు. దళిత చట్టాలను, హక్కులను అవహేళన చేస్తున్న కూటమి ప్రభుత్వ విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

యాంత్రీకరణతో అధిక దిగుబడులు



సాగు పద్ధతులను వివరిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

జి.సిగడాం : యాంత్రీకరణ సాగు ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు అన్నారు. ఆదివారం పాలఖండ్యాం, జగన్నాథపురం గ్రామాల్లో ఫెర్టి కమ్ సీడ్ డ్రిల్ యంత్రాల ద్వారా సాగవుతున్న వరిసాగు ప్రదర్శన క్షేత్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ నీటి ఖర్చుతో ఎకరాకు 13–15 కేజీల విత్తనాలతో సాగు చేసుకుంటే వరినారు, దమ్ము, నాట్లు వేయకుండానే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ధారబోయిన రెయిమ్మ, సమన్వయకర్తలు ధారబోయిన ధర్మరాజ్, డి.సూర్యనారాయణ, ఎ.రామసాయి, వెంకటఅప్పారావు, రైతులు పాల్గొన్నారు.

శ్రీకూర్మంలో ట్రాఫిక్ కష్టాలు



శ్రీకూర్మం మెయిన్‌రోడ్డులో నిలిచిన వాహనాలు

గార: శ్రీకూర్మం మెయిన్ రోడ్డులో ఆదివారం వస్తే ట్రాఫిక్ కష్టాలు తీవ్రతరమవుతున్నాయి. బస్సులను గ్రామంలోకి విడిచిపెడుతుండటంతో ఎక్కడికక్కడ రాకపోకలు నిలిచిపోతున్నాయి. గతంలో వాహనాలను ముందులోనే ఆపేయడంతో ఇబ్బందులుండేవి కావు. ఇప్పుడా పరిస్థితి లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువై భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల నుంచి పంచాయతీ ఆశీలు వసూలు చేయడం తప్ప పార్కింగ్ ప్లేస్‌లో ఉంచేలా సంబంధిత కాంట్రాక్టర్ చర్యలు తీసుకోకపోవడం, దుకాణాలు ముందు వాహనాలు పార్కింగ్ చేయడంతో అవస్థలు మరింత ఎక్కువయ్యాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఉపనిషన్మందిరంలో ఆధ్యాత్మిక ప్రవచనం



నర్సింహమూర్తిని సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఉపనిషన్మందిరంలో జగద్గురు ఆది శంకరాచార్యులు రచించిన దక్షిణామూర్తి స్తోత్రం(మానసోల్లాసం)పై ఆదివారం నిష్టల నర్సింహమూర్తి ప్రవచనం చెప్పారు. మానవుల బుద్ధి పరిణతను దృష్టిలో పెట్టుకొని భాష్య, ప్రకరణ, స్తోత్ర గ్రంథాలను రచించారని తెలిపారు. అనంతరం వక్తను సత్కరించారు. కార్యక్రమంలో మందిర సభ్యులు నారాయణమూర్తి, కోమలరావు, మందుల మోహనరావు, శరత్‌బాబు, ఈశ్వరరావు, మల్లేశ్వరరావు, భట్లు, శ్రీమన్నారాయణ, బాబూరావు, కామేశ్వరరావు, విశ్వేశ్వరరావు, జయలక్ష్మీ, సరస్వతి, లత పాల్గొన్నారు.

శ్రీవారి పుష్కరిణి ప్రతిష్టకు సన్నాహాలు



సమావేశమైన అర్చకులు, భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నారాయణ తిరుమల కొండపై వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద 'శ్రీవారి పుష్కరిణి ప్రతిష్ట' ఏర్పాట్లపై ఆదివారం భక్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. 10వేల మంది దంపతులతో శ్రీవారికి స్వర్ణ పుష్పాభిషేకం, లక్ష మంది భక్తులతో విరాట్ విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణ తదితర కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. కార్యక్రమాల నిర్వహణ కోసం వెయ్యి మంది క్రియాశీలక సభ్యులతో, 10 వేల మంది కార్యకర్తలను సమీకరించేందుకు తీర్మానించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు, వేంకటరామానుజ సేవాదళం సభ్యులు పాల్గొన్నారు.